క్లుప్తంగా

నేడు మాంసం విక్రయాల నిషేధం

కర్నూలు (టౌన్): జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని బుధవారం నగరంలో మాంసం విక్రయాలు చేపట్టరాదని నగరపాలక ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వి.విశ్వేశ్వర రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. కబేళాలు, మాంసం దుకాణాలు తప్పనిసరిగా మూసి వేయాలని, హోటళ్లు, రెస్టారెంట్లలో మాంసాహారం అమ్మకాలు చేపట్టరాదని సూచించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి విక్రయాలు సాగిస్తే భారీ జరిమానాతో పాటు వ్యాపార లైసెన్స్ రద్దు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ట్రెజరీ ఉద్యోగుల వివరాల సేకరణ

కర్నూలు(అగ్రికల్చర్): ఖజానా, లెక్కల శాఖలో ఏళ్ల తరబడి ఒకే చోట పనిచేస్తున్న వారి లెక్క తేల్చేందుకు రంగం సిద్ధమైంది. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో అనేక మంది ఒకే చోట ఏళ్ల తరబడి బదిలీ కాకుండా పనిచేస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వివరాలు తేల్చేందుకు ఆర్థిక శాఖ చర్యలు చేపట్టింది. ఇందుకు 56 కాలమ్స్ ప్రొఫార్మను ఇచ్చింది. ఇందులో ట్రెజరీ ఉద్యోగులకు సంబంధించి సమగ్ర డేటా ఉంటుంది. ఈ ప్రొఫార్మను రెండు రోజుల్లో పూర్తి చేయాల్సిందిగా ఆదేశాలు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని ఆదుకోవాలి

కర్నూలు(అర్బన్): రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న వారందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వామనగిరి హనుమన్న, జిల్లా అధ్యక్షుడు నేనావత్ రాము నాయక్ కోరారు. మంగళవారం పత్తికొండ నియోజకవర్గంలోని పుచ్చకాయలమాడ గ్రామానికి వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను తీసుకువెళ్లామన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలను పెంచి ఎఫ్‌టీఏ కల్పించాలన్నారు.

99 శాతం పింఛన్ల పంపిణీ

కర్నూలు (టౌన్): నగర పాలక సంస్థ పరిధిలో అక్టోబర్ 1వ తేదీన మంగళవారం ఎన్టీఆర్ భరోసా పథకంలో భాగంగా ముమ్మరంగా పెన్షన్ల పంపిణీ చేపట్టారు. మొదటిరోజు 99.05 శాతం పెన్షన్లు పంపిణీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. మంత్రి టీజీ భరత్ ప్రకాశ్‌నగర్‌లోని 125వ సచివాలయం పరిధిలో పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. నగర పాలక కమిషనర్ రవీంద్రబాబు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు



క్రీడా దుస్తులను పంపిణీ చేసిన డైరెక్టర్ హరికిషన్

కర్నూలు (టౌన్): నగర శివారులోని ఆదర్శ విద్యా మందిర్ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఈనెల 2, 3 తేదీల్లో నిర్వహించనున్న ఎస్‌జీఎఫ్ అండర్-19 రగ్బీ పోటీల్లో సత్తా చాటాలని ఆ విద్యాసంస్థల డైరెక్టర్ బి.హరికిషన్ సూచించారు. ఆయన మంగళవారం ఆదర్శ విద్యామందిర్‌లోని క్రీడా మైదానంలో ఆటగాళ్లకు క్రీడాదుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. ఎస్‌జీఎఫ్ అండర్-19 జిల్లా కార్యదర్శి హర్షవర్ధన్, జిల్లా ఆర్గనైజింగ్ మాజీ కార్యదర్శి రామాంజనేయులు పాల్గొన్నారు.

వెంకటలక్ష్మి మృతి పార్టీకి తీరనిలోటు

కర్నూలు న్యూసిటీ: ప్రజా సమస్యల పరిష్కారం, పార్టీ కోసం ఎన్నో పోరాటాలు చేసి కాంగ్రెస్ అక్కగా పిలువబడే కె.వెంకటలక్ష్మి మృతి పార్టీకి తీరని లోటని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. వెంకటలక్ష్మి మృతి విషయం తెలుసుకున్న ఆయన వెంటనే ఆమె గృహానికి చేరుకుని పార్థీవదేహానికి పార్టీ జెండా కప్పి పూలమాలలు వేసి కాంగ్రెస్ నాయకులతో కలిసి ఘన నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. చిదంబరం వీధికి చెందిన వెంకటలక్ష్మి 1990 నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారని కొనియాడారు. ఆమె మృతితో కాంగ్రెస్ పార్టీ ఎంతో అనుభవం ఉన్న గొప్ప కార్యకర్తను కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

మరో ఆరుగురిపై పిచ్చికుక్క దాడి

కర్నూలు (హాస్పిటల్): స్థానిక పాతబస్తీలో పిచ్చికుక్క మరో ఆరుగురు చిన్నారులపై దాడిచేసింది. ఇందులో జొహరాపురానికి చెందిన అబుబాకర్ సిద్దిక్, అయాన్, సబత్ హుసేన్, వై.డి.రామ్ చరణ్, బి.సాత్విక్, గడ్డా వీధికి చెందిన జకీర్ అహ్మద్ ఉన్నారు. వీరందరూ మంగళవారం ఉదయం కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోని చిన్నపిల్లల విభాగంలో చికిత్స పొందారు. సోమవారం రాత్రి 27 మంది చిన్నారులు చికిత్సకు రాగా మంగళవారం ఆరుగురితో కలుపుకుని 33 మంది కుక్కకాటుకు గాయపడ్డారు. వీరందరికీ ఆసుపత్రిలో వైద్యులు ఏఆర్‌వీ, ఇమ్యునోగ్లోబ్లిన్స్ ఇంజెక్షన్లు ఇచ్చి డిశ్చార్జ్ చేశారు.

పెద్దాసుపత్రిలో వైద్య పరికరాల ప్రారంభం



గైనిక్ విభాగంలో వైద్య పరికరాలను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గైనిక్ విభాగంలో మంగళవారం సీటీజీ ఫీటల్ మానిటర్స్, ఓటీ టేబుల్‌లను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమెరికాలోని చికాగోలో నివసిస్తున్న 1962, 1963 బ్యాచ్‌కు చెందిన కర్నూలు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థులు డాక్టర్ కృష్ణారెడ్డి, అరుణ దంపతులు వారి మాతృమూర్తి పెన్నబడి గంగులమ్మ జ్ఞాపకార్థం రూ.30 లక్షల విలువైన వైద్య పరికరాలను ఆసుపత్రికి విరాళంగా ఇచ్చారన్నారు. అందులో భాగంగా గైనిక్ విభాగంలో బీటీ-350 సీటీజీ మానిటర్లు రెండు, ఓటీ టేబుల్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. సీటీజీ మానిటర్స్ ద్వారా గర్భిణులకు కాన్పు సమయంలో శిశువు గుండె పనితీరును పర్యవేక్షిస్తూ ప్రసవం చేయడం వల్ల మాతాశిశు మరణాలు తగ్గించవచ్చన్నారు. ఓటీ టేబుల్ ద్వారా ల్యాప్రోస్కోపీ చేసేటప్పుడు వివిధ పొజిషన్‌లకు ఉపయోగించడం వల్ల రోగులకు సంబంధించి క్లిష్టమైన చికిత్సలు చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. త్వరలో గైనిక్ విభాగంలో ఇన్‌ఫెర్టిలిటీ క్లినిక్ అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఇందులో ల్యాప్రోస్కోపీ, వైద్యపరీక్షలు చేయడానికి అల్ట్రాసౌండ్‌ను త్వరలో ప్రారంభిస్తామన్నారు. త్వరలో ఆన్ టేబుల్ అల్ట్రాసౌండ్ మిషన్‌ను కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. గైనిక్ విభాగాధిపతి డాక్టర్ శ్రీలక్ష్మి, వైద్యులు సావిత్రి, శ్రీలత, స్నిగ్ధ, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ డాక్టర్ హేమనళిని తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

కర్నూలు (రూరల్): కల్లూరులోని అర్బన్ 34వ వార్డు నిర్మల్ నగర్‌లో, సల్కాపురం గ్రామంలో సోమవారం జరిగిన ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి హాజరయ్యారు. లబ్ధిదారులకు ఆమె పింఛన్ సొమ్ము అందజేశారు.

ఆలాగే కర్నూలు మండల పరిధిలోని పి.రుద్రవరంలో మంగళవారం నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి హాజరయ్యారు. లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అనురాధ, పంచాయతీ సెక్రటరీ లక్ష్మీనాథ్, టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చేనేతలను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న ఏపీ చేనేత కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి రాజు

ఎమ్మిగనూరుటౌన్: చేనేత కార్మికులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి రాజు అన్నారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత వస్త్రాలకు రాయితీ కల్పించాలని కోరారు. ప్రస్తుతం చేనేత కార్మికులకు పనులు లేక ఇతర వృత్తులకు వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు చేనేతలు పవర్‌లూమ్‌లతో పోటీపడలేకపోతున్నారన్నారు. 11రకాల వస్త్రాలు చేనేతల ద్వారా తయారు చేయించాలని జీఓ ఉన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నేతన్న నేస్తం కింద ఏటా నేత కార్మికులకు రూ.24వేలు ఇచ్చేదని, అయితే ఈపథకాన్ని కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. సమావేశంలో చేతి వృత్తిదారుల సంఘ జిల్లా కార్యదర్శి గోవిందు, చేనేత కార్మిక సంఘ నాయకులు ఎం.కృష్ణ, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపిక



విద్యార్థి యోధ శంకర్‌రెడ్డిని అభినందిస్తున్న విట్టా రమేష్, మల్లప్ప తదితరులు

ఆదోని అర్బన్: ఆదోని క్రికెట్ అసోసియేషన్ క్రీడాకారుడు టి.యోధ శంకర్‌రెడ్డి కర్నూలు జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడు. స్థానిక లీలా పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న టి.యోధ శంకర్‌రెడ్డి ఈనెల 4 నుంచి 23వ తేదీ వరకు కడపలో జరిగే అండర్-14 అంతర్ జిల్లా పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించడంపై ఆదోని క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విట్టా రమేష్, వైస్ ప్రెసిడెంట్ ముజీబ్, మల్లప్ప హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ జె.ఎం.బాషా, వై.మహదేవ్, ట్రెజర్ వెంకటేష్‌బాబు, అసోసియేషన్ సభ్యులు కొల్లి రవీంద్ర తదితరులు ఉన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



ఎక్సైజ్ స్టేషన్ వద్ద నిరసన తెలియజేస్తున్న మద్యం దుకాణాల సిబ్బంది

ఆదోని రూరల్: ప్రభుత్వ మద్యం దుకాణాలను ప్రైవేట్ పరం చేసేలా ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం జీఓ జారీ చేయడంతో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బంది మంగళవారం విధులను బహిష్కరించి, మద్యం దుకాణాలను మూసివేసి నిరసన తెలియజేశారు. మద్యం దుకాణ సిబ్బంది వీరేష్, చంద్రశేఖర్, వినోద్, రాము తదితరులు మాట్లాడుతూ.. ప్రభుత్వం తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. తాము గతంలో పనిచేస్తున్న ఉద్యోగాలను వదిలివేసి ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసేందుకు చేరామన్నారు. నేడు తమకు ఎలాంటి ఉద్యోగ భద్రత కల్పించకుండా మద్యం దుకాణాలను కూటమి ప్రభుత్వం ప్రైవేట్ పరం చేసేలా జీఓ జారీ చేయడం అన్యాయమన్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించేంతవరకు తాము విధుల్లోకి చేరబోమని తెగేసి చెప్పారు. అనంతరం ఎక్సైజ్ సీఐ సైదులుకు వినతి పత్రం అందించారు. ప్రభుత్వ మద్యం దుకాణాలు బంద్ కావడంతో మందుబాబులకు మద్యం లభించక తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

వృద్ధులు ఆహార నియమాలు పాటించాలి





కార్యక్రమంలో మాట్లాడుతున్న హేమలత, వృద్ధాశ్రమంలో వైద్య చికిత్సలు చేస్తున్న వైద్య సిబ్బంది

కర్నూలు(రూరల్): ప్రస్తుత పరిస్థితుల్లో వృద్ధులు ఆహారపు నియమాలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డిస్ట్రిక్ స్కూల్ హెల్త్‌ప్రోగ్రాం ఆఫీసర్ హేమలత సూచించారు. మండలంలోని మిలటరీ కాలనీలో మంగళవారం జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి వృద్ధులు తప్పక ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. అలాగే వైద్యుల సూచనల మేరకు ఆహారపు అలవాట్లను మార్చుకోవాలని సూచించారు. చిన్నపాటి అనారోగ్యాన్ని కూడా అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డెమో ఆఫీసర్లు చంద్రశేఖర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, డాక్టర్ సుమలత, ఎమ్‌పీహెచ్‌ఓ వెంకటరమణ, పీహెచ్ఎన్ హనుమంతమ్మ, హెల్త్ సూపర్ వైజర్ వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులను జాగ్రత్తగా చూసుకోవాలి

కోడుమూరు రూరల్: అరవైఏళ్లు పైబడిన వృద్ధులను జాగ్రత్తగా చూసుకోవాలని కోడుమూరు కోట్లోకెటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మదన్‌శేఖర్ సూచించారు. మంగళవారం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని కోడుమూరులోని స్నేహ వృద్ధాశ్రమంలో వైద్య సిబ్బంది వృద్ధులకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ సందర్భంగా డా.మదన్‌శేఖర్ మాట్లాడుతూ చిన్న చిన్న అనారోగ్య సమస్యలున్నా వృద్ధులు వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమం నిర్వాహకురాలు సుభాషిణి, ఎంపీహెచ్‌ఈఓ నరసప్ప, హెల్త్ సూపర్‌వైజర్ కమాల్‌సాహెబ్, సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన పేరిణి లాస్యం



నృత్య ప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై జనగామ జిల్లాకు చెందిన చంద్ర కళా నిలయం వారి పేరిణి లాస్యం, ఆంధ్రనాట్య ప్రదర్శన అలరించింది. వినాయకగద్య, బ్రహ్మగద్య, సంధ్యాతాండవం, మూషికవాహన, మహాగణపతిం, నమోనమో నటరాజ, తహనం సమయతి, దేవికైవారం తదితర గీతాలకు శిరీషలక్ష్మి, హర్షిణి, అక్షర, సహస్ర, నిత్యశ్రీ, అక్షయ, జశ్విత, శ్రీవాణి, హిమశ్రీ, రేణుశ్రీ, సింధుశరణ్య, భవ్యశ్రీ తదితరులు నృత్య ప్రదర్శన చేశారు.

ఫారెస్ట్ అధికారుల మెరుపు దాడి

బండిఆత్మకూరు: స్థానిక ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జెడ్.నాసిర్‌జా ఆధ్వర్యంలో సిబ్బంది నారపురెడ్డి కుంట సెక్షన్‌లోని జాగ్వర్ బేస్ క్యాంపు నుంచి బొమ్మరస్తా, మసిబండ రస్తాలో మెరుపుదాడులు నిర్వహించి దోమతెర కట్టెలు, కలపను రవాణా చేస్తున్న 13 సైకిళ్లను స్వాధీనం చేసుకొని, గాజులపల్లె టింబర్ డిపోకు తరలించారు. దాడుల్లో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు తేజా నాయక్, రామేశ్వరి, ప్రసన్న, మొబైల్ పార్టీ టీం, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ హైమావతి, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.



సైకిళ్లను స్వాధీనం చేసుకున్న ఫారెస్ట్ అధికారులు

ఫుట్‌బాల్‌కు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ



ఫుట్‌బాల్ క్వార్టర్ ఫైనల్ పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు (టౌన్): ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్ క్రీడకు ఎంతో ఆదరణ ఉందని, దిగ్గజ క్రీడాకారులు మెస్సీ, రోనాల్డోను ఆదర్శంగా తీసుకొని ప్రతిభ చాటాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ క్రీడాకారులకు సూచించారు. నగర శివారులోని లక్ష్మీపురం రిడ్జ్ పాఠశాలలో మంగళవారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సీబీఎస్‌సీ క్లస్టర్-7 ఫుట్‌బాల్ పోటీలు మూడు రోజులుగా హోరాహోరీగా సాగుతున్నాయి. మంత్రి టీజీ భరత్ అతిథిగా హాజరై ఫుట్‌బాల్‌ను కిక్ కొట్టి క్వార్టర్ ఫైనల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల వల్ల ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ అలవడుతుందన్నారు. కేంద్ర క్రీడల మంత్రితో మాట్లాడి కర్నూలు నగరంలో జాతీయస్థాయి వసతులతో రాష్ట్ర ప్రభుత్వం తరపున స్టేడియం నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. రవీంద్ర విద్యా సంస్థల చైర్మన్ మోహన్‌కుమార్ మాట్లాడారు. రిడ్జ్ సీఈఓ జి.గోపీనాథ్, టోర్నమెంట్ కార్యదర్శి రాజేంద్రన్, ప్రిన్సిపాల్ రాజ్‌కమల్ పాల్గొన్నారు.

పోటీల వివరాలు

మంగళవారం జరిగిన పోటీల్లో కృష్ణా జిల్లా షామ్‌రాక్ స్కూల్ జట్టుపై 1-0 గోల్స్‌తో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ జట్టు విజయం సాధించింది. పెనాల్టీ షూటౌట్‌లో 2-0 గోల్స్‌తో ఎడిఫై వరల్డ్ స్కూల్ జట్టుపై సమ్రతా స్కూల్ జట్టు, ఖమ్మంకు చెందిన నవభారత్ స్కూల్ జట్టుపై హార్ట్‌ఫుల్‌నెస్ లెర్నింగ్ సెంటర్ స్కూల్ జట్టు గెలుపొందాయి. అనంతపురం ది వెరిడియస్ స్కూల్ జట్టుపై 2-0 గోల్స్‌తో తెలంగాణకు చెందిన సన్‌ఫ్లవర్ వేదిక్ స్కూల్ జట్టు, అలాగే అండర్-17 విభాగంలో చిత్తూరుకు చెందిన వెరిటాస్ సైనిక్ స్కూల్ జట్టుపై 5-0 గోల్స్‌తో విశాఖపట్నంకు చెందిన నేవీ చిల్డ్రన్ స్కూల్, హైదరాబాద్‌కు చెందిన బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్ జట్టుపై సమస్థి ఇంటర్నేషనల్ స్కూల్ జట్టు 2-1 గోల్స్ తేడాతో గెలుపొందింది.

జాతిపితకు ఘననివాళి

కర్నూలు సిటీ: జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఉస్మానియా కాలేజీలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో ఆ కాలేజీ ప్రిన్సిపాల్ సయ్యద్ సమీవుద్దీన్ ముజమ్మిల్ పాల్గొని మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ చరిత్రను మార్చిన మహనీయుడు మహాత్మా గాంధీ అని, సత్యం, అహింసా మార్గాన్ని తిరుగులేని ఆయుధంగా మార్చగలిగిన గొప్ప ధైర్యశాలి అని కొనియాడారు. గాంధీజీ జీవితాన్ని ప్రతి విద్యార్థి తప్పక తెలుసుకోవాలన్నారు. శాంతియుతంగా, అహింస మార్గాన నడుస్తూ సమాజాన్ని నడిపించిన గాంధీ త్యాగాలను వారు కొనియాడారు. కార్యక్రమంలో ఆ కాలేజీ డాక్టర్ మండి అన్వర్ హుసేన్, ఉన్నతి ఫౌండేషన్ ఛేంజ్ మేకర్ హిమబిందు, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ ఎస్.గౌస్ పీరా, తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడిన మద్యం, నిందితులతో ఎస్ఐ చంద్రమోహన్, పోలీస్ సిబ్బంది

కోసిగి: మండల పరిధిలోని కందుకూరు గ్రామ సమీపంలో కర్ణాటక మద్యం బాటిళ్లను ఇద్దరు వ్యక్తులు తరలిస్తుండగా పట్టుకున్నట్లు కోసిగి ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. మంగళవారం తుంగభద్ర నది తీర గ్రామాల్లో పర్యటిస్తుండగా మండలంలోని కడదొడ్డి గ్రామానికి చెందిన తోవి వినోద్, కౌతాళం మండలం తిప్పల దొడ్డి గ్రామానికి చెందిన కాకం గారి జగదీష్ 10 బాక్స్‌లలో 960 కర్ణాటక టెట్రా ప్యాకెట్లు తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వారిపై ఇద్దరు పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఏఎస్ఐ తిరుపాల్ నాయక్, హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్, మల్లికార్జున ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరురూరల్: దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరె కృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని గుడేకల్ జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో డీటీఎఫ్ నాయకులు నిరసన కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ బుధవారం కర్నూలులోని గాంధీ విగ్రహం వద్ద డీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు విజయ్‌కుమార్, మారుతి, షకూర్‌సాహెబ్, రాముడు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఉచిత శిక్షణ

మద్దికెర: ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు మూడు రోజుల పాటు స్టెప్ (స్టూడెంట్ టీచర్స్ ఎడ్యుకేషన్ పేరెంట్స్) వారి ఆధ్వర్యంలో ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు చేత ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులకు ఉచితంగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆపద్బాంధవ సేవా సమితి అధ్యక్షుడు, స్టెప్ జిల్లా సమన్వయకర్త చొక్కా సునీల్ కుమార్ మంగళవారం తెలిపారు. ఉపాధ్యాయులు వ్యక్తిత్వ వికాస మార్గదర్శకులుగా కావడానికి ఈ శిక్షణ తరగతులు ఎంతో దోహదపడతా యన్నారు. శిక్షణా తరగతులు గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం నెక్కల్లు గ్రామంలో ఉన్న ధ్యాన ఆశ్రమంలో నిర్వహిస్తారని హాజరయ్యే ఉపాధ్యాయులకు ఉచితంగా శిక్షణతో పాటు భోజన వసతి, మెటీరియల్స్, సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల వారు 9030644440, 8143234555 నంబర్లకు సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ఆశ్రమంలో వృద్ధుల దినోత్సవం



వృద్ధులకు బెడ్‌షీట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కర్నూలు (అర్బన్): నగరంలోని బి.క్యాంప్‌లో ఎంఎస్ రూరల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న మన వృద్ధులు, పిల్లల ఆశ్రమంలో మంగళవారం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి వృద్ధులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వృద్ధులకు కావలసిన ఉచిత న్యాయ సహాయం కొరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని తెలిపారు. న్యాయ సహాయం సంబంధిత ట్రిబ్యునల్, అప్పిలేట్ ట్రిబ్యునల్‌లో పొందవచ్చని చెప్పారు. అనంతరం వృద్ధులకు బెడ్‌షీట్లు పంపిణీ చేశారు. విభిన్న సామర్థ్యం, వికలాంగ, లింగమార్పిడి, వయోవృద్ధుల సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ ఫాతిమా బీ, సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు సహదేవరెడ్డి, సంస్థ నిర్వాహకుడు ఇస్మాయిల్ పాల్గొన్నారు.

జియారత్‌తో ముగిసిన ఎల్లార్తి ఉరుసు



ప్రత్యేక అలంకరణలో షేక్షావలి తాత సమాధి

హొళగుంద: ఎల్లార్తిలో వెలసిన షేక్షావలి, షాషావలి తాతల ఉరుసు మంగళవారం జియారత్ కార్యక్రమంతో ప్రశాంతంగా ముగిసింది. ఆంధ్రా, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు దర్గాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అదే విధంగా దూద్‌పీరా, జెండాకట్ట తదితర దర్గాలను దర్శించుకున్నారు. ఉత్సవంలో భాగంగా సెప్టెంబర్ 29న గంధం, 30న ఉరుసుతో పాటు మంగళవారం జియారత్ కార్యక్రమాలు జరిగాయి. పీఠాధిపతి నూర్‌బాబా ఖాద్రి గంధం మోసుకుని ఆయా దర్గాల్లో ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు. అలాగే భక్తులకు ధర్మ సందేశాన్ని ఇచ్చి ఆశీర్వదించారు. ఈ సమయంలో దర్గాలో ఉంటున్న ఫకీరులు ఆటపాటలతో నృత్యాలు చేసి భక్తులను అలరించారు. ఏపీ వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో జరిగిన 362వ ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పత్తికొండ డీఎస్పీ వెంకట రామయ్య ఆధ్వర్యంలో ఎస్ఐ బాలనరసింహులు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



గంధంతో వెళ్తున్న పీఠాధిపతి నూర్‌బాబా ఖాద్రి

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

కర్నూలు (టౌన్): గత నెల 30వ తేదీ నంద్యాల పట్టణంలోని స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో నిర్వహించిన తైక్వాండో జిల్లా స్థాయి స్కూల్‌గేమ్స్ క్రీడా పోటీల్లో నారాయణ విద్యార్థులు ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక పాఠశాలలో.. అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బి.లైఖ్యశ్రీ చందన, జి.కార్తీక్, అండర్-14 విభాగంలో మహమ్మద్ అద్నాన్, మనోజ్‌కుమార్‌లను పాఠశాల ఏజీఎం రమేష్‌కుమార్, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి అభినందించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు తిరుపతిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. తైక్వాండో కోచ్ షబ్బీర్ పాల్గొన్నారు.

వృద్ధుల సంక్షేమం కోసం ట్రిబ్యూనల్

కర్నూలు (అర్బన్): వయో వృద్ధుల సంక్షేమ చట్టం- 2007 ప్రకారం ప్రతి రెవెన్యూ డివిజన్‌లో వృద్ధుల సంక్షేమం కోసం ట్రిబ్యూనల్స్ ఏర్పాటు చేయడం జరిగిందని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయీస్ ఫాతిమా అన్నారు. ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక ఎ.క్యాంప్‌లోని మాంటిస్సోరి స్కూల్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ ఎం.జయప్రకాష్, బి.సహదేవరెడ్డి, గోవిందరావు, హెచ్.చంద్రన్న, ఎల్.క్రిష్టఫర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రయీస్ ఫాతిమా మాట్లాడుతూ.. తల్లిదండ్రులు, సీనియర్ పౌరుల పోషణకు ప్రతిఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. డివిజన్ స్థాయిలో ఏర్పాటు చేసిన ట్రిబ్యూనల్స్‌కు ఆర్‌డీఓ అధ్యక్షులుగా, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారన్నారు. వృద్ధుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే పథకాలను పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు. ఈ నేపథ్యంలోనే వయో వృద్ధులకు వివిధ రకాల సేవలు అందించిన పది మందిని ఘనంగా సన్మానించారు. అలాగే వయో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసి మెడికల్ క్యాంప్ నిర్వహించారు.